ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 19 జూన్ 2025 | 5





ఎన్‌కౌంటర్ జరిగిన కింటుకూరులోని కొండ ప్రాంతం... (కింద) కింటుకూరులోని అటవీ శాఖ బేస్ క్యాంప్.. ఈ ప్రాంతం వెనుకనే ఎన్‌కౌంటర్ జరిగిన కొండ ఉంది..

మన్యంలో మళ్లీ తుపాకీల మోత!

- దశాబ్దకాలంగా ప్రశాంతం
- మళ్లీ మావోయిస్టుల కదలికలు
- వేటాడుతున్న బలగాలు
- కూంబింగ్‌తో జల్లెడ
- కొద్దిరోజుల్లోనే రెండు ఎన్‌కౌంటర్లు
- గత నెల వై.రామవరంలో.. ఇప్పుడు కింటుకూరు
- మన్యం గిరిజనుల్లో అలజడి

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

కొన్నేళ్లుగా మావోయిస్టు రహిత ప్రాంతంగా ఉన్న రంపచోడవరం మన్యం తుపాకీల మోతతో మళ్లీ దద్దరిల్లుతోంది. పాపికొండల అభయారణ్యంలోని మారేడుమిల్లి-దేవీపట్నం మండలాల సరిహద్దుగా ఉన్న రంపచోడవరం మండలం కింటుకూరు అటవీ ప్రాంత కొండలపై బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌తో మన్యం ఉలిక్కిపడింది. వరుస ఘటనలు, మావోయిస్టు నేతల కదలికల నేపథ్యంలో రంప మన్యాన్ని మళ్లీ మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగా ప్రభుత్వాలు భావిస్తున్నాయి. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలు, సరిహద్దు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సాగిస్తున్న వేట ప్రభావంతో కీలక మావోయిస్టు నేతలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లే క్రమంలో ప్రత్యేక పోలీసు బలగాలకు చిక్కి హతమవుతున్నారు. సుమారు ఒక దశాబ్దకాలంగా రంపచోడవరం మన్యంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్లకు సంబంధించి చెప్పుకోదగ్గ ఘటనలు లేవు. మావోయిస్టులు సైతం రంపచోడవరం మన్యంలో కదలికలు లేనట్టుగానే వ్యవహరించారు. రంప మన్యంలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా లేదని కూడా భావించారు. రంప మన్యానికి సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌ఘడ్, ఒడిశా ప్రాంతాల్లో అనేక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ వాటి ప్రభావం ఇంతవరకూ రంప మన్యంపై పడిన సందర్భాలు లేవు. ఇంచుమించుగా పాపికొండల అభయారణ్య ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని భావిస్తున్న తరుణంలో ఎన్‌కౌంటర్ జరగడం మన్యంవాసులను ఆందోళనకు గురిచేసింది. సరిహద్దు రాష్ట్రాల్లో మావోయిస్టు ఏరివేత ఆపరేషన్ నేపథ్యంలో ముఖ్యమైన కీలక మావోయిస్టు నేతలను ఇక్కడికి తరలించి కాపాడుకునే క్రమంలో వారి కదలికలు తెలుస్తున్నాయని, తద్వారా వారి కదలికలపై అందుతున్న నిఘా సమాచారం పోలీసులకు చేరి ఈ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారని కొద్దిరోజులుగా వినిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మారేడుమిల్లి మండలం గుడిసె పర్యాటక ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద ఎత్తున సంచరించిన ఆధారాలు సేకరించిన పోలీసులు సదరు సంచారంపై కేసు నమోదు చేసి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిని సైతం జైలుకు పంపారు. అనంతరం పలు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలను గుర్తించిన పోలీసులు వారి కోసం గాలింపును ముమ్మరం చేస్తూనే వారి కదలికలపై నిఘాను పెంచి ఖచ్చితమైన సమాచారాన్ని తెలుసుకుని అక్కడికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే మే 8వ తేదీన వై.రామవరం మండలం శేషరాయి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలను గుర్తించిన గ్రేహౌండ్స్ బలగాలు జరిపిన కూంబింగ్‌లో మావోయిస్టులు సాగించిన ఎదురు కాల్పులకు ప్రతిగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. వారిలో కీలక నేతలు కాకూరి పండన్న అలియాస్ జగన్, రమేష్ ఉండడంతో మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బే - మిగతా 6వపేజీలో

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతం!

మన్యం మళ్లీ తుపాకుల మోతతో హోరెత్తింది. బుధవారం తెల్లవారుజామున రంపచోడవరం మండలం కింటుకూరు గ్రామశివారు ఫారెస్టు బీట్ చెక్‌పోస్టు సమీపంలో అటవీ ప్రాంతంలోని కొండపైన మావోయిస్టులకు, కూంబింగ్ బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి అలియాస్ ఉదయ్ (మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ సెక్రటరీ), విశాఖ జిల్లా పెందుర్తి మండలం కరకవాణిపాలెంకి చెందిన వెంకట రవిలక్ష్మి చైతన్య అలియాస్ అరుణ, రూపీ (ఏపీ జోనల్ కమిటీ సభ్యురాలు), అంజూ (ఛత్తీస్‌గఢ్, స్టేట్ కమిటీ సభ్యురాలు) ఉన్నారు.



ఆదమరిస్తే.. కొట్టేస్తారు!

- లబ్ధిదారులపై సైబర్ బూచోళ్ల వల
- ఓటీపీ చెప్పాలంటూ దోపిడీ
- తల్లికి వందనం డబ్బులపైనా గురి
- ఉమ్మడి జిల్లాలో కేసులు నమోదు
- జాగ్రత్తగా ఉండాలంటూ పోలీసుల హెచ్చరిక

కంటికి కనిపించని శత్రువు సాంకేతికత మాధ్యమంగా దోపిడీకి వల విసురుతున్నాడు. రకరకాలుగా జనాలను మోసం చేస్తూ క్షణాల్లో ఖాతాల్లోని సొమ్మును ఖాళీ చేస్తున్నాడు. వాడే సైబర్ నేరగాడు. ఎక్కడో ఉంటాడు.. చిరునామా తెలుసుకోవడం అంత సులభం కాదు.. దేశంలో ఉండొచ్చు.. విదేశాల నుంచి ఆపరేట్ చేయొచ్చు. ఏదొక మాయ చేసి ఖాతాల్లోని డబ్బు మాయం చేయడమే వాడి లక్ష్యం. అయితే సైబర్ నేరగాళ్ల కన్ను ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులపై పడింది. గతంలో అడపాదడపా జరిగినా.. సరిగ్గా పథకాల సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమయ్యే సమయంలో నేర తతంగం మళ్లీ తెరపైకి వస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటికే రెండు కేసులు నమోదు కాగా.. ఒక ఘటనపై ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు. ఓటీపీ, ఏపీకే ఫైల్స్ పంపిస్తూ డబ్బులు కొట్టేస్తున్నారు. బ్యాంకు, పోలీసు అధికారులమంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ఏదేమైనా అత్యాశకు పోకుండా, ఓటీపీలు తెలియని వారికి చెప్పకుండా అప్రమత్తంగా ఉండడమే ఈ నేరాలకు అడ్డుకట్ట అని పోలీసులు పేర్కొంటున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సైబర్ నేరగాళ్లు రకరకాల పేర్లు, హోదాలతో ఫోన్లు చేస్తున్నారు. ఇవాళ ఫోన్ నెంబర్లు అంగట్లో సరుకుల మాదిరిగా మారిపోయాయి. ఆ వెసులుబాటు సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రతిరోజూ సైబర్ క్రైం నమోదవుతూనే ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్ములు బ్యాంకుల్లో డీబీటీ విధానంలో జమవుతున్నాయి. ఆ సమయంలో కచ్చితంగా సైబర్ నేరగాళ్లు తమ వలకు పని చెబుతున్నారు. ఫోన్ చేసి నమ్మకంగా మాట్లాడి దోపిడీ చేస్తున్నారు. తీరా సెల్‌ఫోన్‌కి మెసేజ్ వచ్చిన తర్వాత గానీ ఖాతాలో డబ్బులు మాయమైనట్టు తెలియడం లేదు. అప్పటికే ఆ దోపిడీ సొమ్మును సైబర్ నేరగాళ్లు ఇతర ఖాతాలకు మళ్లించడం, ఎక్కడైనా కొనుగోళ్లు చేయడం వంటివి చేస్తున్నారు. ఇలా దోపిడీ సొమ్ము రెండు, మూడు చేతులు మారుతోంది. దీంతో పోలీసులు ఆ సొమ్ములను వెనక్కి రప్పించడం కష్టమవుతోంది.

● పథకాల లబ్ధిదారులే టార్గెట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ విధానంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములను జమ చేస్తున్నాయి. ఇప్పుడు తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో పడుతున్నాయి. పైగా ఎందరు పిల్లలున్నా కూటమి ప్రభుత్వం అంతమందికీ రూ.13 వేల చొప్పున ఇస్తోంది. దీంతో ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న వారి ఖాతాల్లో ఎక్కువ మొత్తంలో సొమ్ములు జమవుతున్నాయి. త్వరలో అన్నదాత సుఖీభవ కూడా అమలుకానుంది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకున్నట్టు కనిపిస్తోంది. ఓటీపీ, ఏపీకే ఫైల్స్ పంపిస్తూ ఇప్పటికే మోసాలకు పాల్పడుతున్నారు. మీరు ఫలానా పథకానికి అర్హత పొందారు. ఓటీపీని మీ సెల్‌కి పంపించాం. అది చెబితే ఖాతాల్లో డబ్బులు పడతాయంటూ చెబుతున్నారు. ఓటీపీ చెప్పిన వెంటనే అప్పటికే ఖాతాలో ఉన్న డబ్బులు సైబర్ నేరగాళ్ల ఖాతాలకు చేరుతున్నాయి. ఇదంతా నిమిషాల్లో జరిగిపోతోంది. మరి కొన్ని కేసుల్లో ఏపీకే ఫైల్స్‌ని పంపిస్తున్నారు. ఆ లింక్ క్లిక్ చేయగానే దోపిడీకి గురవుతున్నారు.

● పీఎం ఆవాస యోజన అంటూ..

ఈనెల 15న రాజమహేంద్రవరంలోని ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద లబ్ధిదారుగా ఎంపికయ్యారని, అప్లికేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి రూ.4,996 పంపించాలని చెప్పాడు. ప్రభుత్వ వచ్చేస్తోందన్న సంతోషంలో ఆ వ్యక్తి సొమ్మును ఫోన్‌పే ద్వారా పంపించాడు. తర్వాత అటు నుంచి సమాధానం లేదు. ఫోన్‌పే నెంబరుకు ఫోన్‌చేయగా ఫలితం లేకపోయింది. దీంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం విభాగాన్ని ఆశ్రయించాడు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నరేంద్రపురానికి చెందిన నేలపూడి శ్రీనివాసరావుకు గత నెల 27న ఓ ఫోన్ వచ్చింది. బ్యాంకు అధికారులమని, వ్యక్తిగత ఖాతా సీజ్ అయ్యిందని చెప్పారు. ఓటీపీ వచ్చిందని అది చెబితే తిరిగి ఖాతా మనుగడలోకి వస్తుందని చెప్పడంతో శ్రీనివాసరావు అవతలి వ్యక్తికి ఓటీపీ చెప్పాడు. అంతే బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేల కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. మళ్లీ 29న సైబర్ నేరగాడు ఫోన్‌చేసి మీ ఖాతాలో డబ్బులు పొరబాటున మాకు వచ్చేశాయని, మళ్లీ ఓటీపీ వచ్చిందని, అది చెబితే కట్ అయిన డబ్బులు ఖాతాలో జమవుతాయని నమ్మబలికాడు. దీంతో శ్రీనివాసరావు ఓటీపీ చెప్పగా.. ఈసారి రూ.5 లక్షలు లాగేశాడు. ముందు ఓటీపీ ద్వారా రూ.10 వేలు కట్ అయినప్పుడు శ్రీనివాసరావు ఖాతా వివరాలను దొంగిలించి వాటిని ఉపయోగించి రెండు రోజుల్లో శ్రీనివాసరావు పేరున లోన్ పొందాడు. ఆ సొమ్ము ఖాతాలో పడిన వెంటనే ఈ విధంగా కొట్టేశాడు.

● నెలకు మూడు నాలుగు..

ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరాలు రోజుకు 20 వరకూ జిల్లా కేంద్రాల్లోని సైబర్ సెల్‌లో రిపోర్టు అవుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్లకు వచ్చినవి, అవగాహన లేకపోవడంతో ఎవరికీ చెప్పలేక కుమిలిపోతున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే ఆ సంఖ్య రెట్టింపు ఉండొచ్చు. దీనిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలంటూ మోసం చేస్తున్నవి నెలకు మూడు నాలుగు ఉంటున్నాయని తెలుస్తోంది. బాధితులు గ్రహించి ఫిర్యాదు చేసే సమయానికి ఎక్కువ కాలం గడిచి రికవరీ కష్టంగా మారుతోంది. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించిన వెంటనే 1930కి కాల్ చేయాలని, తమను సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని, ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత ఫలితం ఉంటుందన్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్న కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. ఈనెల 5న కస్టమర్ కేర్ నంబరు గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా శ్రీకాంత్‌కి వచ్చిన ఓటీపీని చెప్పారు. అంతే క్రెడిట్ కార్డులో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెం.1930 కనెక్ట్ కాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు.. ఆ సొమ్మును ఫ్రీజ్ చేసి పది రోజుల్లో వెనక్కి రప్పించి బాధితుడికి అందజేశారు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో వల విసురుతుంటారని, తెలియని లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఓటీపీని బ్యాంకులు గానీ ఏ ఇతర సంస్థలకు గానీ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని బెదిరిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అయితే.. ఇన్సూరెన్స్, పొదుపు పథకాల ఏజెంట్లు వినియోగదారుడు చేయాల్సిన ప్రక్రియంతా పూర్తి చేసి ఓటీపీ చెప్పాలని కస్టమర్‌ని అడుగుతున్నారు. ఈ క్రమంలో కూడా మోసగాళ్ల వలలో చిక్కుకునే అవకాశం లేకపోలేదనే వాదన ఉంది.



గొల్లప్రోలు టోల్ ప్లాజా

సాగిపోండి.. సాఫీగా..

- ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే చాలు
- ఫాస్టాగ్‌లో ఆగస్టు 15 నుంచి నూతన విధానం
- టోల్‌ప్లాజాల ద్వారా 200 సార్లు లేదా ఏడాది కాలానికి
- ప్రతిసారీ రీచార్జి చేసుకునే బాధ ఉండదు
- కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ప్రతిసారీ ఫాస్టాగ్ రీచార్జి చేసుకునే చింత ఉండదు. ఏడాది కాలానికి ఒకేసారి రూ.3వేలు చెల్లిస్తే దేశంలో ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా వెళ్లే అవకాశాన్ని కల్పించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ విధానంతో వాహనదారుల ప్రయాణం ఇక సాఫీగా సాగిపోతుంది. అయితే దీన్ని కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్య గల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి. వీటితోపాటు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్‌ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్ని రకాల కార్లు, వేన్‌లు, ఫోర్‌వీల్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుము కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100శాతం అదనంగా చెల్లించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది. ఇకపై ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుము చెల్లించే విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. జాతీయ రహదారి ఫీ చట్టం 2008 కింద దీనిని అమల్లోకి తీసుకువస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే నూతన విధానం ప్రకారం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫాస్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఈ రీచార్జి చేయించిన వాహనం దేశంలోని జాతీయ రహదారులపై ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే వీలుంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణలోకి తీసుకుంటారు. ఏడాది కాలానికి ఫాస్టాగ్ తీసుకుంటే ప్రతి ఏటా ఏప్రిల్ 1వ తేదీన రీచార్జి చేయించుకోవాల్సి ఉంటుంది.

వీటికి వర్తిస్తుంది..

ఏడాది ఫాస్టాగ్ రూ.3వేల రీచార్జిని కార్లు, జీపులు, వేన్‌లకు పరిమితం చేశారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే వీటిని వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. ముందుగా కార్లు, జీపులు, వేన్‌లకు దీనిని అమలుచేయడం ద్వారా పరిశీలన జరిపి దశలవారీగా అన్ని వాహనాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వాహనదారులకు లాభమే..

ఏడాది లేదా 200సార్లు తిరిగేందుకు వీలుగా ఫాస్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుంది. గొల్లప్రోలు టోల్ ప్లాజా ద్వారా కారు, జీపు వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుముగా ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10వేలు అవుతుంది. అదే నూతన విధానంలో రూ.3వేలు చెల్లిస్తే సరిపోతుంది. అదే కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ.22 వేలు, ఈతకోట వద్ద టోల్‌ప్లాజా వద్ద 25 వేలు వ్యయం అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుములు వసూలు చేస్తున్నారు. దీనివల్ల సాధారణ పద్ధతుల్లో అయ్యే ఫాస్టాగ్ రుసుములో కేవలం 15 శాతం నుంచి 33 శాతం లోపుగా ఒకేసారి చెల్లిస్తే ఏడాదిపాటు లేదా 200 సార్లు ప్రయాణించే వీలుకలుగుతుంది. ఫాస్టాగ్ రీచార్జి విధానంపై ఆయా కేటగిరీల వాహనదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈ టోల్‌ఫీ అన్ని రకాలుగా తమకు లాభదాయకమేనని చెబుతున్నారు.

21న జిల్లాలో యోగాకు 5వేల వేదికలు

- 2800మంది ట్రైనర్లతో నిర్వహణ

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 21న ఉదయం జిల్లావ్యాప్తంగా 5వేల వేదికల ద్వారా యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. 2800మంది ట్రైనర్ల ద్వారా కామన్ యోగాకు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధన దిశగా ఈకార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంలో 5వేలమందితో యోగాసనాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. 20న ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అమరావతినుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. జేసీ నిషాంతి, డ్వామా పీడీ మధుసూదన్, డీఈవో షేక్ సలీంబాషా పాల్గొన్నారు.

ముంపునీటిని సముద్రంలోకి తరలించేందుకు భూమిపూజ

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సర్పంచ్‌లు, రైతులు
- అభినందించిన రాజోలు ఎమ్మెల్యే

అంతర్వేది, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్వేది తీరప్రాంతం ముంపునకు గురి కాకుండా పరిష్కార మార్గాన్ని చూపడానికి ముందుకు వచ్చిన సర్పంచ్‌లు, రైతులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభినందించారు. అంతర్వేది, అంతర్వేది దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ముంపు నీటిని సముద్రంలోకి పంపింగ్ చేసే పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. తీరప్రాంత గ్రామాలు దశాబ్ధకాలంగా ముంపునకు గురవుతున్నాయన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్‌తోపాటు ముంపు ప్రాంతాల రక్షణకు పరిష్కార మార్గాలు అన్వేషించామన్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధ్యత తీసుకుని ముంపునీటిని తరలించేందుకు రూ.25లక్షల బడ్జెట్‌తో కూడిన పనులకు తనతో శ్రీకారం చుట్టించడం.. నియోజకవర్గంలోనే పైలెట్ ప్రాజెక్టుగా చేస్తుండడం అభినందనీయమన్నారు. ముంపు నీటిని సముద్రంలోకి నిరంతరం లిఫ్ట్ చేయడంవల్ల చాలా వరకు ముంపు సమస్యకు పరిష్కారం చూపవచ్చునన్నారు. శిథిలావస్థలో ఉన్న స్లూయిస్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, రాళ్లకాల్వకు రూ.2.32కోట్లు టెండరు దశలో ఉన్న ఈ ప్రాజెక్టు కూడా పూర్తయితే సఖినేటిపల్లి మండలం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ముంపునీటిని సముద్రంలోకి మళ్లించడానికి 40కే ట్రాన్స్‌ఫార్మర్, రెండు 10 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటుకు రైతులతో ముందుకు వచ్చిన సర్పంచ్ కిశోర్, ఇతర ఆక్వా రైతులు, ఆక్వా ఫీడ్ షాపు యజమానులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణికుమార్, రాజోలు డెల్టాప్రాజెక్టు వైస్‌చైర్మన్ ఆకన బాబ్జీనాయుడు, సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు(కిశోర్), కొండా జాన్‌బాబు, ఎంపీటీసీలు చొప్పల బాబూరావు, బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, రావూరి నాగు, అడపా రాంబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు పోతురాజు సురేష్, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లంకొండ స్వామితాత, బెల్లంకొండ ఆదినారాయణ పాల్గొన్నారు.



అంతర్వేది తీరప్రాంతంలో ముంపు నీరు తరలింపునకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సీతపల్లి వాగులో స్నానానికి దిగి.. ఇద్దరి మృతి 7

రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు విడుదల 7

పి.గన్నవరంలో మట్టి అక్రమ తవ్వకాలు
రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు లారీలు సీజ్

'నన్నయ'లో మెగా యోగాంధ్రకు తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ 6

సర్క్యూట్ టూరిజం మాస్టర్ ప్లాన్ డీపీఆర్‌లు సిద్ధం చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు ప్రముఖ దేవాలయాల సర్క్యూట్ టూరిజం మాస్టర్ ప్లాన్ డీపీఆర్‌లు ఆగస్టు నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. రాబోయే 20ఏళ్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ప్రసాద్ స్కీమ్ కింద సర్క్యూట్ టెంపుల్ టూరిజం ప్రతిపాదించాలన్నారు. బీచ్ టూరిజం, హెరిటేజ్ హోంస్టే, బోటింగ్ టూరిజం అంశాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లా పర్యాటక కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్కిటెక్చర్ కిరణ్ టూరిజం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు.

రూ.3.93 కోట్ల రాయితీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీ

అమలాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ కింద 521 పనిముట్లను రూ.3.93కోట్ల రాయితీతో పంపిణీ చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం రైతులకు 2024-25 వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 రోటోవేటర్లు, 370 పవర్‌టిల్లరు, 54 ట్రాక్టరుతో నడిచే యంత్ర పరికరాలు, 50బ్యాటరీ స్ప్రేయర్లు, 26 పవర్ స్ప్రేయర్లు, 1 పవర్ రీడర్, గ్రాస్ కట్టర్లతో కలిసి 521 పరికరాలను పంపిణీ చేశారు. హార్వెస్టర్ల ద్వారా వరి కోత పనులను చేయడంవల్ల ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


వెలిచేరు నుంచి ఆత్రేయపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి


ర్యాలి-లొల్ల మధ్య


ర్యాలి-అంకంపాలెం మధ్య


బొబ్బర్లంక-అమలాపురం మార్గంలో...


లొల్ల లాకులు-రావులపాలెం నడుమ

వృక్షాలే గొడుగులై...

బొబ్బర్లంక-ఊబలంక మధ్య 'చల్లని' ప్రయాణం

ఆత్రేయపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేరళను తలపించే అందాలు కోనసీమలోనూ కనిపిస్తాయి. గోదావరి పరవళ్లు, పచ్చని పైర్లు పర్యాటకులను కట్టిపడేస్తాయి. ఇక్కడి రహదారులపై ప్రయాణం వేసవిలోనూ 'చల్లగా' సాగుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో ఎటు వెళ్లినా పచ్చదనమే సాక్షాత్కరిస్తుంది. రహదారులకు ఇరువైపులా వృక్షాలు గొడుగులా ఎండను కప్పేసి ప్రయాణికులకు చల్లదనాన్నిస్తున్నాయి. బొబ్బర్లంక నుంచి ఊబలంక వరకు 20 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రయాణం ఎంతో హాయిగా ఉంటుంది. ర్యాలి, అంకంపాలెం, వాడపల్లి, వెలిచేరు, రాజవరం మీదుగా వెళ్లే ప్రయాణికులు పచ్చని వృక్షాల చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ మార్గంలో మీరూ ఓసారి వెళ్లి ఆ అనుభూతిని సొంతం చేసుకోండి.


ఊబలంక-ర్యాలి ఆర్‌అండ్‌బీ రహదారి

వ్యవసాయంపై మమకారం


చెందుర్తిలోని తన పొలంలో దగ్గరుండి ఆయిల్‌పామ్ మొక్కలు నాటిస్తున్న డాక్టర్ రవీంద్ర



సింగపూర్ వెళ్లి వైద్యుడిగా స్థిరపడినా సొంత ఊరిలో వ్యవసాయంపై మమకారం వీడలేదు. పొలం కొని పంటల సాగును స్వయంగా పర్యవేక్షిస్తూ కూలీలతో పని చేయిస్తూ సంతృప్తి చెందుతున్నారు. ఇప్పుడు వరి కంటే ఆయిల్‌పామ్ సాగు మేలని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంతో పంట మార్పిడి చేయాలని భావించి స్వయంగా ఇక్కడకు వచ్చి దగ్గరుండి మొక్కలు నాటించారు.

- సింగపూర్‌లో స్థిరపడినా సొంతూరిలో గతంలో 11 ఎకరాల్లో వరి సాగు
- ఇప్పుడు ఆయిల్‌పాము సాగుకు శ్రీకారం
- దగ్గరుండి మొక్కలు నాటించిన వైద్యుడు రవీంద్ర

గొల్లప్రోలు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన డాక్టర్ పుప్పాల రవీంద్ర సింగపూర్‌లో వైద్యుడిగా స్థిరపడ్డారు. అయినా తన గ్రామంలో వ్యవసాయంపై ఆసక్తి మాత్రం వీడలేదు. తనకు ఉన్న 11 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ కూలీలకు అక్కడి నుంచే సూచనలు ఇస్తూ ఉండేవారు. నాలుగు దశాబ్దాల క్రితం ఇక్కడి నుంచి వెళ్లినా ఏటా లేదా ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చి తన పొలాలను చూసుకుని సంతృప్తి చెందేవారు. క్రమం తప్పకుండా వరి, అపరాలు సాగు చేసే డాక్టర్ రవీంద్ర దృష్టి ఈసారి ఆయిల్‌పామ్ సాగుపై పడింది. ప్రభుత్వం వరి కంటే ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు అధికంగా వస్తాయని, ఈ పంట సాగు చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించడంతో తనకు ఉన్న 11 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆయిల్‌పామ్ సాగును దగ్గరుండి ప్రారంభించాలని నిర్ణయించుకున్న డాక్టర్ రవీంద్ర సింగపూర్ నుంచి కొద్ది రోజుల క్రితం స్వగ్రామమైన చెందుర్తి వచ్చారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పెద్దాపురం బృందంతో చర్చలు జరిపి ఆయిల్‌పామ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇటీవల వర్షాలు కురవడంతో పొలాన్ని దుక్కి దున్నించారు. పతంజలి ప్రతినిధులతో కలిసి 11 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దగ్గరుండి మొక్కలు నాటించారు. ఈయనకు పతంజలి ఏజీఎం డి.రవీంద్ర, క్లస్టర్ ఆఫీసర్ కామేశ్వరరావు సహకారం అందించారు. పంటల సాగుపై తనకు ఉన్న మక్కువ సింగపూర్‌లో ఉన్నా ఎల్లప్పుడూ చెందుర్తిలోని తన పొలాల్లో సాగవుతున్న పంటపైనే ఉంటుందని డాక్టర్ రవీంద్ర 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. తాను ఎంత బిజీగా ఉన్నా నిత్యం పొలం పనులు చేసే కూలీలతో మాట్లాడుతూ ఉంటానని చెప్పారు.


గోలి వారి కొత్తూరులో చిగురించిన నారుమడులు

జోరుగా కర్ర పెండలం

దుంప నాట్లు

మెట్ట ప్రాంతాల్లో సీజన్‌ను ముందే ప్రారంభించిన రైతులు

సామర్లకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంత పొలాల్లో కర్ర పెండలం దుంప సాగులో భాగంగా నాట్లు ప్రక్రియలో రైతులు ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఈ ఏడాది మే నెలలో ముందుగా వర్షాలు కురవడంతో పెద్దాపురం, సామర్లకోట, రంగంపేట, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల్లో నాట్లు వేసే ప్రక్రియతో పాటు కొందరు రైతులు నారుమడులు (పళ్లాలు) కట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. కేవలం వర్షాధార పంటగా... అందునా కాకినాడ జిల్లాలోనే సాగుచేసే ఏకైక పంటగా ప్రసిద్ధి పొందిన కర్ర పెండలం దుంప ద్వారానే సగ్గుబియ్యం తయారీ, ఎగుమతులు చేస్తూ ఏటా రూ.30కోట్ల మేర వ్యాపార లావాదేవీలు సాగిస్తుంటారు. ప్రతిఏటా జూన్ మొదటివారంలో సాగుకు శ్రీకారం చుడతారు. అయితే గత ఆరేళ్లుగా వాతావరణ పరిస్థితులు ఎంతమాత్రం అనుకూలించకపోవడంతో జూలై నెల వరకు దుంప నాట్లు పడే అవకాశాలు లేకపోయాయి. అయితే ఈ ఏడాది ఊహించని రీతిలో మే నెలలో ముందుగానే వర్షాలు కురవడంతో మెట్ట భూములు పదును చేరి దుక్కి దున్ను, నారుమడులు వేసుకునేందుకు దోహదపడింది. నాణ్యమైన విత్తనం కర్ర, అధిక దిగుబడులు అందించే మేలైన విత్తనం కర్ర ఎంచుబడి పనుల్లో దుంప రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నారు మడులకు సైతం సకాలంలో నీటి తడులు అంది ముక్కలు చిగురించాయి. దీంతో రెండు రోజులుగా నాట్లు, నాటిన ముక్కలు చనిపోతే వాటి స్థానంలో మనేదలు వేసే పనులపై రైతులు దృష్టి సారించారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని మండలాల్లో మంగళవారం సాయంత్రానికి సుమారు 3,500 ఎకరాల్లో నాట్లు, మరో 5 వేల ఎకరాల్లో నారుమడులు సిద్ధం చేసినట్టు ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు.


ముమ్మరంగా కర్రపెండలం దుంప నాట్లు

మరిడమ్మ జాతరను

విజయవంతం చేయాలి

- పెద్దాపురం డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

పెద్దాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈనెల 24వ తేదీ నుంచి వచ్చేనెల 31 వరకు జరిగే మరిడమ్మ జాతర మహోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులను డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆదేశించారు. ఈమేరకు పెద్దాపురంలో అమ్మవారి ఆషాఢమాస జాతర మహోత్సవాల ఏర్పాట్లపై సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా రవాణా, పార్కింగ్, భక్తులకు వసతి, తాగునీరు, విద్యుత్‌సరఫరా, బందోబస్తు, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, క్రౌడ్ మేనేజ్‌మెంట్, క్యూలైన్ల నిర్వహణ, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు, సాంస్కృతిక ప్రదర్శనలు, సూచికల ఏర్పాటు వంటివి చేయాలన్నారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. నిరంతరం వైద్యసేవలు అందించేందుకు వీలుగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పనిచేసేందుకు వీలుగా ప్రదేశాలు, బస్టాండ్ వద్ద భక్తుల సౌకర్యార్థం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్, ఆలయ పరిసరాల్లో పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. సమావేశంలో పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, ఎస్‌ఐ వి.మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

తగిలింది. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టు నేతలకూ గాయాలై ఉండవచ్చని భావించారు. శేషరాయి ఘటన జరిగి నెల రోజులకే రంపచోడవరం మండలం పాపికొండల అభయారణ్యం పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం నాడు మావోయిస్టుల కదలికలను గుర్తించి ముగ్గురు మావోయిస్టులను గ్రేహౌండ్స్ బలగాలు మట్టుపెట్టాయి. ఈ ప్రాంతానికి మావోయిస్టులు చేరుకున్నారన్న పక్కా సమాచారంతోనే గ్రేహౌండ్స్ బలగాలు అడవిని మంగళవారం సాయంత్రం నుంచే చుట్టుముట్టాయి. మన్యంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్ల ద్వారా మావోయిస్టు పార్టీలోని కీలక నేతలు బలికావడం మావోయిస్టులకు పెద్ద దెబ్బగానే పోలీసులు అభివర్ణిస్తున్నారు.

ఎలా వచ్చారు? ఎలా చిక్కారు?

- శేషరాయిలోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ తప్పించుకున్న వారేనా?
- ఆధునిక టెక్నాలజీ, డ్రోన్ నిఘాలతో మావోయిస్టు కదలికలపై పోలీసులదే పైచేయి

రంప మన్యంలో మునుపెన్నడూ మావోయిస్టు కదలికలు లేని ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లో మృతి చెందిన ఇద్దరు మావోయిస్టులు కీలక నేతలు, మరో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఇక్కడకు ఎలా వచ్చారు, గ్రేహౌండ్స్ ఆపరేషన్స్‌కు ఎలా చిక్కారన్న ప్రశ్నలు పోలీసు అధికారుల సమాధానం కోసం ఎదురుచూస్తున్నాయి. గతంలో సైతం వై.రామవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, రాజఒమ్మంగి మండలాల్లో మావోయిస్టుల కదలికలు ఎక్కువగా ఉండేవి. అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల్లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులు మావోయిస్టు కీలక నేతలను సురక్షితంగా రక్షించుకునే సురక్షిత ప్రాంతాలు మావోయిస్టులకు అవసరమయ్యాయి. అటు పోలీసులు సైతం ఆధునిక సాంకేతికపరిజ్ఞానం, సెల్‌ఫోన్ల తరంగాలను అనుసంధానించుకుంటూ మావోయిస్టుల కదలికలను గుర్తించడంలో డ్రోన్ల సాయాన్ని వాడుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుదెబ్బలు తింటూ తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితుల్లో సురక్షితప్రాంతాల కోసం అన్వేషిస్తూ గతంలో ఎప్పుడూ కదలికలు లేని ప్రాంతాలను సైతం ఎంచుకుని కీలకనేతలను అక్కడకు పంపుతున్నారన్న సమాచారాన్ని పోలీసులు తెలుసుకుంటున్నారు. బుధవారం నాటి ఎన్‌కౌంటర్లో మృతి చెందినవారు..మేలో వై.రామవరం మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్లోనూ, ఛత్తీస్‌గఢ్‌లో నంబళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్లోనూ తప్పించుకున్నవారే అయి ఉండవచ్చు నన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే పలుసురక్షిత ప్రాంతాలకు తరలించబడిన వారి సమాచారం ఆధారాలతో సహా బయటపడి ఇలా పోలీసు తూటాలకు చిక్కుకుంటున్నారా వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఎన్‌కౌంటర్ అనంతరం ఉత్పన్నమయ్యే ఇలాంటి ప్రశ్నలన్నిటికీ పోలీసువర్గాలే స్పష్టమైన వివరణ ఇస్తూ ఉంటారు.

కానీ బుధవారం రాత్రి వరకూ పోలీసులు ఎటువంటి అధికారిక ప్రకటననూ ఇక్కడి మీడియాకు విడుదల చేయలేదు. మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి సురక్షితంగా తరలించడం మినహా ఎటువంటి సమాచారాన్ని మీడియాకు ఇవ్వలేని పరిస్థితి బుధవారం రాత్రివరకూ సాగింది. రంపచోడవరం డీఎస్పీ సైతం విశాఖలో ప్రధాని పర్యటన బందోబస్తు బాధ్యతల్లో ఉండగా,ఈ ఎన్‌కౌంటర్ అనంతరం జిల్లా ఎస్పీ చొరవతో రంపచోడవరం చేరుకోవడానికి రాత్రి పొద్దుపోయింది. దీంతో ఎటువంటి అధికారిక సమాచారాన్ని ఇక్కడి దిగువస్థాయి అధికారులు వెల్లడించలేదు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దన్ గురువారం స్వయంగా వెల్లడించనున్నారని మాత్రం ఇక్కడి పోలీసు అధికారులు మీడియాకు వెల్లడించారు.

'నన్నయ'లో మెగా యోగాంధ్ర

- 16,123 మంది విద్యార్థులతో కార్యక్రమం విజయవంతం
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు
- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


యోగాసనాలు వేస్తున్న విద్యార్థుల సమూహం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు సర్టిఫికెట్‌ను అందుకుంటున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూన్18 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని 16,123 మంది విద్యార్థులతో నిర్వహించారు. దీంతో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు లభించిందని వర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా నన్నయ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం బెలూన్స్ వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే విద్యార్థులు చేసిన అతిపెద్ద యోగా ప్రదర్శనగా నమోదయ్యిందన్నారు. నన్నయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. అనంతరం తెలుగు బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డ్సు సర్టిఫికెట్‌ను సంస్థ నిర్వాహకులు వీసీకి అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీస్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సుకు చెందిన డాక్టర్ రాయుడు సీకే, తాతా వెంకట వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం (రాజమహేంద్రవరం), కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. వారిచే కానవరంలోని రాపర్తిరామా యోగా సంస్థ బృందం ప్రభుత్వం నిర్దేశించిన యోగాసనాలను ప్రోటోకాల్ ప్రకారం చేయించారు.

యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత భారత్‌దే

- ఈగల్ ఐజీపీ ఆర్‌కే రవికృష్ణ
- జీజీయూలో మెగా యోగా ప్రారంభం



ఈగల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఐజీపీ రవికృష్ణ, అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, చైతన్యరాజు

రాజానగరం, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మన దేశానికే దక్కుతుందని ఈగల్ ఐజీపీ ఆర్‌కే రవికృష్ణ పేర్కొన్నారు. బుధవారం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఐజీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తాను నిత్యం యోగా చేస్తానని, ప్రతిఒక్కరూ కూడా తమ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే సమష్టి కృషితో మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. వర్సిటీ ప్రాంగణంలో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రతి కళాశాలలోనూ విద్యార్థులతో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేస్తామని, జీజీయూ విద్యార్థులు కూడా చేరాలన్నారు. ఎక్కడైనా గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు కనిపిస్తే 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ మాదవద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అడిషనల్ అడిషనల్ ఎస్పీ ఎస్‌బీ మురళీ కృష్ణ, నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, రాజానగరం, ఈగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసన్న వీరయ్యగౌడ్, పీవీ సూర్యమోహనరావు, జీజీయూ వైస్‌చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీని వాసరావు, యు.చంద్రశేఖర్, వైస్ ఛాన్సలర్ కేవీబీరాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాస రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యులు మోది సత్తిబాబు, ప్రిన్సిపాల్స్, డీన్లు పాల్గొన్నారు.

యోగాంధ్ర గీతానికి

రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి

- గీత రచయిత తొండంగి ఎంపీడీవోకు ప్రధాని సభలో పాడే అరుదైన అవకాశం


ఎంపీడీవో రాజేశ్వరరావు

తొండంగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ఉద్దేశించి కాకినాడ జిల్లా తొండంగి ఎంపీడీవో రాజేశ్వరరావు రచించి గానం చేసిన యోగాంధ్ర గీతానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. బుధవారం ఆయన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా రూ. 50 వేల నగదు బహుమతి తోపాటు మెమెంటోను ఆయన అందుకున్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో ఈనెల 16, 17, 18 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన పోటీలో సుమారు 600 మంది వివిధ జిల్లాలకు చెందినవారు పాల్గొనగా, రాజేశ్వరరావు గీతానికి మాత్రమే ప్రథమ బహుమతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే రాజేశ్వరరావు యోగాంధ్ర విశిష్టతను, యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ అర్థవంతమైన పదాలతో గీతాన్ని రచించి స్వీయగానం చేశారు. రాష్ట్ర స్థాయిలో మండల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేసిన ఎంపీడీవోను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య, తదితరులు అభినందించారు.

తల్లికి వందనం.. ఆనందం!

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమచేయడంతో ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ డబ్బులు తీసుకోవడానికి బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద క్యూ కడుతున్నారు. బుధవారం రాజమహేంద్రవరం, కాకినాడలో గల పోస్టాఫీసుల్లో ఎంతోమంది అమ్మలు తల్లికి వందనం డబ్బులు అందుకుని సంతోషం వ్యక్తం చేశారు. విక్టరీ సింబల్ చూపిస్తూ కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు.

ఫొటోలు : కాకినాడ, రాజమహేంద్రవరం స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు


కాకినాడ పోస్టాఫీస్‌లో క్యూ కట్టిన తల్లులు



రాజమహేంద్రిలో డబ్బులు అందుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లులు

వాగులో స్నానానికి దిగి... ఉధృతికి కొట్టుకుపోయి!

● సీతపల్లిలో ఇద్దరు యువకులు మృతి ● కోటికేశవరంలో విషాదఛాయలు

రంపచోడవరం/కోరుకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో ఇద్దరు యువకులు మృతిచెందారు. కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామానికి చెందిన పీతల రాజేష్ (25), గుమ్మడి హర్ష(25) మరో 15 మంది స్నేహితులతో కలిసి బుధవారం పార్టీ చేసుకోవడానికి సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగులో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు వాగు ఉధృతికి కొట్టుకుపోవడంతో స్థానికుల సాయంతో ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే వారు మృతిచెందారు. దీంతో మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో కోటి కేశవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ మూడే సింధు దివ్య కామేష్, ఎంపీటీసీ నూలు అర్జున్, గ్రామపెద్దలు హుటాహుటిన బయల్దేరి సీతపల్లి వాగువద్దకు చేరారు. గురువారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తీసుకురానున్నారు. మరణించిన యువకులకు వివాహాలు కాలేదు. చిన్న వ్యాపారాలు, కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఇద్దరి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


రాజేష్, హర్ష ఫైల్‌ఫొటోలు

బాలిక అదృశ్యంపై దర్యాప్తు ముమ్మరం : డీఎస్పీ

కరప, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో బాలిక అదృశ్య ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దాపురం డీఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం ఆయన కరప పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐ తోట సునీత, ఏఎస్ఐ సూరిబాబుతో కేసు వివరాలపై చర్చించారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు డీఎస్పీని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. బాలిక అదృశ్యానికి కారణంగా భావిస్తున్న యువకుడి తండ్రిని డీఎస్పీ పిలిపించి మాట్లాడారు. వారి ఎక్కడున్నారనే సమాచారం చెప్పాలని, లేకపోతే కిడ్నాప్, పోక్సో చట్టాల కింద కేసు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మైనర్ బాలిక అదృశ్యానికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. ఎస్ఐ ఇచ్చిన సమాచారం మేరకు బాలిక వివరాలను హైదరాబాద్ పోలీసులకు అందజేశామని, కేసును త్వరలోనే ఛేదిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

సూక్ష్మజీవుల కల్చర్‌తో పంటలో అవశేషాలను కుళ్ల బెట్టుకోవాలి

రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్

దివాన్‌చెరువు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మజీవుల కల్చర్‌తో పంటలో అవశేషాలను కుళ్లబెట్టుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రంలో వ్యవసాయపరపతి సంఘం ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా బుధవారం సూక్ష్మజీవులకు సంబంధించిన పలు జీవన ఎరువులు-విశిష్టత అనే అంశంపై ట్రైనీలకు ఆయన శిక్షణ ఇచ్చారు. పంట తీసుకున్న తరువాత మిగిలిన పంట వ్యర్థాలను, అవశేషాలను సూక్ష్మజీవులతో కూడిన కల్చర్‌లను వాడితే త్వరగా వ్యర్థాలు కుళ్లడమేకాకుండా కుళ్లిన అవశేషాలు తదుపరి పంటకు సేంద్రియ ఎరువుగా పనిచేస్తుందని చెప్పారు. సమతుల్యత కాపాడుకోగలుగుతామన్నారు. పంటల్లో నాణ్యమైన దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. ఏరువాక శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ పరిశోధన స్థానంలో సూక్ష్మజీవుల కల్చర్‌లపై జరుగుతున్న పరిశోధనలను వివరించారు. వివిధరకాల జీవన ఎరువులు కల్చర్‌ల నమూనాలను ప్రయోగాత్మకంగా చూపారు. వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.అనూష జీవనెరువులు నమూనాలను ప్రయోగాత్మకంగా చూపారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జీవో నెం.71తో ఇద్దరు ఖైదీలు విడుదల

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.71తో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు జీవిత ఖైదీలకు ప్రత్యేక రిమిషన్ ఇచ్చి వారిని విడుదల చేసినట్టు జైలు సూపరింటిండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. జీవో నెం.71 హోం (పరోల్స్ అండ్ హెచ్ఆర్‌సీ) శాఖ 2025 ఏప్రిల్ 17 ప్రకారం 2025 ఫిబ్రవరి 1నాటికి అర్హత కలిగిన జీవిత కారాగారా శిక్ష పొందిన ఖైదీలకు ప్రత్యేక రమిషన్ ఇస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల జారి చేసిందన్నారు. అదేవిధంగా మరో జీవోనెం.91ని ఈనెల 18న జారీ చేశారని, దీని ప్రకారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న కొనేటి సత్తిబాబు, గజ్జవరపు మురళీకృష్ణ అలియాస్ మురళీ అలియాస్ కృష్ణను బుధవారం సాయంత్రం విడుదల చేసినట్టు రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నిబంధనలు వారికి తెలియజేసి వ్యక్తిగత బాండ్‌లు, హామీలు నిబంధిత ప్రోఫార్మలో సమర్పించిన తర్వాతే ఇద్దరిని విడుదల చేశామన్నారు.

ఏడీబీ రోడ్డు పనుల పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సాగరమాల పథకంలో భాగంగా కాకినాడ బీచ్ నుంచి తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వరకు ఏడీబీ రోడ్డు ఆధునీకీకరణ, విస్తరణ పనులను కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడంతో ఆయనే అధికారులతో కలిసి ఉండూరు కూడలిలో పనులను చూశారు. 80 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని సకాలంలో పూర్తి చేయిస్తామని చెప్పారు.

కోలుకుంటున్న గిరిజనులు

రౌతులపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కలుషితం ఆహారం తిని అస్వస్థతకు గురైన గిరిజనులు కోలుకుంటున్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం దబ్బాది గ్రామానికి చెందిన గిరిజనులు కలుషిత ఆహారం తిని కడుపునొప్పి, విరోచనాలతో రౌతుల పూడి ఆసుపత్రిలో చేరిన విషయం విధితమే. ఆసుపత్రిలో 38మంది చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కోలుకున్న వారిని ఇంటికి పంపిస్తామన్నారు. గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహిస్తున్నారు.


రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులు

కదలాల్సిందే..

» సచివాలయ సిబ్బంది బదిలీకి రంగం సిద్ధం
» ఐదేళ్ల తర్వాత స్థాన చలనం
» మార్గదర్శకాలు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
» ఈనెల 30 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల కార్యక్రమం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జోరుగా సాగుతోంది. ఇప్పటికే పలు శాఖల్లో ఈ ప్రక్రియ పూర్తి అయ్యింది. కొన్ని విభాగాల్లో మాత్రం ఇంకా జరుగుతోంది. ప్రస్తుతం సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. గత ఐదేళ్లుగా వీరికి బదిలీలు లేకపోవడంతో వీరందరినీ కదిపేందుకు కూటమి సర్కారు సంకల్పించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. గతేడాది నవంబతిరులో పరిమిత స్థాయిలో బదిలీలు జరగగా ఇప్పుడు జీవో నంబర్ 5 ప్రకారం మొత్తం ఉద్యోగులకు స్థానచలనం కల్పించేలా అవకాశం కల్పించింది.

గతేడాదే అవకాశం...

వాస్తవానికి సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గతేడాదే ప్రభుత్వం అవకాశం కల్పించినా మెజారిటీ ఉద్యోగులు బదిలీలకు సిద్ధపడలేదు. దీంతో నామమాత్రంగానే జరిగాయి. చాలామంది ఐదేళ్ల పాటు ఒకే సచివాలయంలో పాతుకుపోయారు. దీంతో ఐదేళ్లపాటు ఒకే సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను వేరే సచివాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్లు పూర్తికాని ఉద్యోగుల వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే ఉద్యోగులెవరికీ వారి సొంత మండలాలకు బదిలీ అయ్యేవీలు లేకుండే సర్కారు చెక్ పెట్టింది. దీం తో ఉద్యోగ సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువ జీతంతో పనిచేసే వారికి సొంత ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం కల్పిస్తే ఆర్థిక భారం తప్పుతుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1590 వార్డు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అందులో 319 వార్డు, 1271 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారు 12 వేల మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. అయితే ఇక్కడ వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందికి సంబంధించి బదిలీలకు వేర్వేరు మాడ్యూల్స్ రూపొందించారు. వార్డు సచివాలయ ఉద్యోగుల బాధ్యత మున్సిపల్ కమిషనర్లకు, గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీ బాధ్యత ఎంపీడీవోలకు, జిల్లా పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఇప్పటికే ఎక్కడెక్కడ ఏయే ఖాళీలు ఉన్నాయి? ఎవరెవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు? సొంత మండలాల్లో పనిచేస్తున్న వారు ఎందరు? ఇలా అందరి సర్వీసు చిట్టాలను పరిశీలిస్తున్నారు. ఉద్యోగుల ఎంపిక సమయంలో జరిగిన విధంగానే ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థులు తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. జూన్ 16 నుంచి 18 వరకు ఖాళీల నమోదు, 22 నుంచి 24 వరకు బదిలీలకు దరఖాస్తులు, జూన్ 25 నుంచి 29 వరకు దరఖాస్తుల పరిశీలన, జూన్ 30వ తేదీ నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది.

సచివాలయ ఏఎన్‌ఎంలకు రీ వెరిఫికేషన్

అభ్యర్థులందరికీ ఆర్డర్ కాపీలను అందజేసిన కాకినాడ డీఎంహెచ్‌వో

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)/ జీజీహెచ్(కాకినాడ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సచివాలయ ఏఎన్‌ఎంలు నుంచి మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ (ఎంపీహెచ్ఏ)(ఎఫ్) లుగా పదోన్నతి పొంది గత ఆదివారం కౌన్సిలింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్ ఈ ప్రక్రియను నిర్వహించా రు. ఉమ్మడి జిల్లా నుంచి గతంలో కౌన్సిలింగ్‌కు హాజరై తమ స్థానాలు నిర్దేశించబడ్డ 390 మంది ఏఎన్‌ఎంలు ఈ రీవెరిఫికేషన్ ప్రక్రియకు హాజరయ్యారు. తాజా ప్రక్రియలో ఇద్దరు ఏఎన్‌ఎంలు అవకతవకలకు పాల్పడినట్టు వెల్లడయ్యింది. ఆదివారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో వీరు అవ కతవకలకు పాల్పడి బదిలీ ప్రయోజనాలు పొం దారు. ఓ ఏఎన్‌ఎం వివాహిత అయినా కూడా అవివాహితరాలన్న మినహాయింపులో బదిలీ ప్ర యోజనాలు పొందింది. అలాగే మరో ఏఎన్‌ఎం ప్రొహిబిషన్ పిరియడ్ డిక్లేర్ కాకపోయిన అయిపోయిందని బదిలీ దరఖాస్తులో పేర్కొంది. తాజాగా ఈ రెండు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీరిపై చార్జ్‌లు ఫ్రేమ్ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో గత ఆదివారం నిర్దేశింపబడ్డ స్థానాల్లోనే కొందరు కొనసాగనుండగా ఇంకొందరికి ఆయా స్థానాల్లో మార్పులు జరిగాయి. కౌన్సిలింగ్ ప్రక్రియ ఉదయం ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగింది. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఎనిమిదిమంది అధికారులు ఈ కౌన్సిలింగ్ నిర్వహించారు. రీ వెరిఫికేషన్ అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ అభ్యర్థులందరికీ ఆర్డర్ కాపీలను అందజేశారు. అయితే రీ కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగాయని పలువురు ఏఎన్‌ఎంలు ఆరోపిస్తున్నారు.


ఆర్డర్ కాపీని అందజేస్తున్న డీఎంహెచ్‌వో

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత


సామర్లకోటలో మహిళకు బ్యాగ్‌ను అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు

సామర్లకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికురాలు ఆటోలో పోగొట్టుకున్న బ్యాగ్‌ను కేవలం కొద్దిగంటలలోనే భద్రంగా అప్పగించిన సంఘటన బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలో జరిగింది. వివరాల్లోకి వెళితే బుధవారం పిఠాపురానికి చెందిన మహిళ తన పిల్లలతో కలిసి పిఠాపురంలో ఆటో ఎక్కి సామర్లకోట బస్‌కాంప్లెక్స్ ఎదురుగా దిగింది. కాంప్లెక్స్‌లో తాను ఎక్కాల్సిన బస్ ఉందనే హడావిడిలో ఆటోలో తన బ్యాగ్ మరిచిపోయింది. బస్ ఎక్కేశాక తన బ్యాగ్ ఆటోలో మరిచిపోయినట్టు గుర్తించి బస్ దిగిపోయి ఎదురుగా ఉన్న ట్రాఫిక్ పోలీస్టేషన్లో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావుకు ఫిర్యాదు చేసింది. ట్రాఫిక్ పోలీస్టేషన్లో సీసీ ఫుటేజీలను పరిశీలించి ప్రయాణికురాలు ఎక్కిన ఆటోను గుర్తించి ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆటోలోనే బ్యాగ్ ఉండడంతో తిరిగి బ్యాగ్‌ను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు భద్రంగా మహిళకు అందజేశారు. సదరు బ్యాగ్‌లో విలువైన భూముల డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు, ఏటీఎం కార్డులు, హాస్పిటల్ రిపోర్టులు ఉన్నట్టు మహిళ గుర్తించి ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎల్లయ్యపేటలో గ్యాస్ లీకై మంటలు

ముగ్గురికి గాయాలు

తొండంగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఎల్లయ్యపేట గ్రామంలోని ఎస్ అండ్ ఎస్ హేచరీలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన ప్రమాదంలో బుధవారం ముగ్గురికి గాయాలైనట్టు తొండంగి పోలీసులు తెలిపారు. హేచరీ పనివారికి భోజనాలు తయారు చేసే నిమిత్తం ప్లాట్‌ఫాం పై కిందన ఒక స్టవ్, పైన మరో స్టవ్ ఏర్పాటు చేసి వంట చేస్తుండగా కిందినున్న స్టవ్ పైపు వద్ద మంటలు చెలెగడంతో వంట పనిచేస్తున్న పంపాదిపేటకు చెందిన కుందేటి వీరబాబు, యర్రంపాలెం గ్రామానికి చెందిన వజ్రపు నాని, యల్లయ్యపేటకు చెందిన సూరాడ అనంతలక్ష్మికి గాయాలయ్యాయన్నారు. వారిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఆరుగురి అరెస్టు

పిఠాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బి.ప్రత్తిపాడు, చెందుర్తి, ఏకే మల్లవరం, ఉప్పాడ, మూలపేట గ్రామాల్లో అధికారులు, సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న రాయుడు అప్పలనరస, గోనిబిల్లి చక్రం, బులిపే బాబులు, కోడా చంద్ర, గుబ్బల కనకలక్ష్మి, వెంకటరమణను అరెస్టు చేశారు. 37 లీటర్ల సారా, 30 మద్యం సీసాలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ వి.శివరామరాజు, ఎస్ఐలు విజయకుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 21 మందికి కాకినాడ 3వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి శ్రీదేవి జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1,2 సీఐలు ఎన్.రమేష్, డి రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 21 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో నలుగురికి 5 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 8 మందికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, అలాగే మరో 9 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90,000 జరిమానా విధించినట్టు సీఐ రామారావు పేర్కొన్నారు.

రమ్యసుధ కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

రంగంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పరిశోధనల ద్వారా అంతర్జాతీయస్థాయిలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట హైస్కూల్‌కి గుర్తింపు తెచ్చిన రమ్యసుధ కృషి అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రశంసించారు. మంగళవారం రాత్రి రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయంలో తనను కలిసిన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.రమ్యసుధతో మాట్లాడారు. ఈనెల 12, 13వ తేదీల్లో నేపాల్ దేశంలోని ఎంఐటి ఖాట్మండులో అంతర్జాతీయస్థాయిలో ఏర్పాటుచేసిన ఇన్నోవేటివ్ ప్రాక్టీస్ ఫర్ ఆక్సిలరేటెడ్‌గ్రోత్ ఇన్ కామర్స్ హ్యూమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని రీ ఇన్ వింటింగ్ టుమారో డ్రైవింగ్ గ్రోత్ త్రు సైంటిఫిక్ ఇన్నోవేషన్ అనే పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డు లభించిందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులను తీసుకువెళ్లాలని, తమ వంతు ప్రోత్సాహాన్ని అందించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ కోరారు. రమ్యసుధ మంచి గుర్తింపు తెచ్చిన పలు అంశాలపై ఎంపీకి ఆయన వివరించారు. మన వంతు ప్రోత్సాహాన్ని రమ్యసుధకు అందిద్దామని ఎంపీ హామీ ఇచ్చారు. నేతల ప్రోత్సాహానికి రమ్యసుధ కృతజ్ఞతలు తెలిపారు.


రమ్యసుధను అభినందిస్తున్న పురందేశ్వరి

పి.గన్నవరంలో మట్టి అక్రమ తవ్వకాలు

రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు లారీలను సీజ్ చేసిన అధికారులు

పి.గన్నవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో మట్టి తవ్వకాలకు ఎక్కడ కూడా అనుమతులు లేవని మైన్స్ అధికారులు బహిరంగంగా ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా రాత్రి, పగలు తేడా లేకుండా నదిగర్భాలను సైతం గుల్లం చేస్తున్నారు. మానేపల్లి గ్రామ పరిధిలోని ఒక ర్యాంపులో ఇప్పటికే కోట్లాది రూపాయల తువ్వ మట్టి తరలిపోయిందని ఆరోపణలు ఉన్నాయి. వైవి పాలెం దిగువున లంకల గన్నవరం గ్రామ పరిధిలోని అనుమతులు లేకుండా రాత్రి, పగలు తేడా లేకాండా తవ్వకాలు జరుపుతున్నారు. ఉడిమూడిలో మట్టి ర్యాంపు పేరుతో ఇసుకను సైతం కొల్లగొడుతున్నారు. ఈ నేపథ్యంలో బెల్లంపూడిలో నాలుగు రోజులు క్రితం కొత్తగా పుట్టుకొచ్చిన మట్టి ర్యాంపుపై మైన్స్, రెవెన్యూ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు లారీలను సీజ్ చేసినట్టు మైన్స్ ఆర్ఐ టి.సూజాత తెలిపారు. స్థానిక తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఆధ్వర్యంలో లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించి ఎక్స్‌కవేటర్లను పోలీసుల, రెవెన్యూ ఆధీనంలో ఉంచినట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఎంతమేర తవ్వకాలు జరిపారో పరిశీలన చేసి నివేదికను జిల్లా మైన్స్ అధికారికి సమర్పిస్తామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే కఠినమైన చర్యలు తప్పవని తహశీల్దార్ పల్లవి హెచ్చరించారు. దాడుల్లో మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ అలీ, ఆర్ఐ డాంగే, మైన్స్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బెల్లంపూడి లంకలో దాడులు నిర్వహించిన తహశీల్దార్ శ్రీపల్లవి, మైన్స్ అధికారులు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం కాకినాడకు చెందిన నాళం పరసురామ్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్

కాకినాడ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో పి.లక్ష్మీవేద సంహిత ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంహితను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి సుగుణారెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బీఈ.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ అభినందించారు.


వేదసంహితను అభినందిస్తున్న దృశ్యం

మేడిచర్లపాలెంలో యోగా డే

మలికిపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మేడిచర్ల పాలెం యూపీ పాఠశాలలో బుధవారం యోగా డే నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కంకటాల చంద్రశేఖర్ విద్యార్థులతో పలు యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆరేటి త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.3.97లక్షలు

ఆత్రేయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,97,777 లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

30న తపాలా అదాలత్

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారంపై ఈనెల30న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ రెయ్యి నవీన్‌కుమార్ తెలిపారు. 30వ తేదీ ఉదయం 11గంటలకు అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్ జరుగుతుంది. తపాలా సర్వీసులకు సంబంధించిన వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే చర్చిస్తారన్నారు. ఈనెల20వ తేదీలోగా సమస్యను తపాలా అదాలత్ శీర్షికతో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, అమలాపురం డివిజన్, అమలాపురం,-533201 చిరునామాకు పంపించాలన్నారు. గడువు ముగిసిన తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించమని, ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా తపాలా అదాలత్‌కు హాజరు కావచ్చునన్నారు.

23న ఒలింపిక్ డే రన్

ప్రచారపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే



అమలాపురంలో ఒలింపిక్ డే రన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల23న ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఒలింపిక్ డే రన్‌లో భాగంగా రూపొందించిన ప్రచార పత్రాలు, సర్టిఫికెట్లను బుధవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. జిల్లాలోని 22మండలాల్లో 23వ తేదీ ఉదయం 9గంటలకు ఒలింపిక్ డే రన్ నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తెలిపారు. ఒలింపిక్ డే రన్‌లో పాల్గొనే క్రీడాకారులందరికీ ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. మండల కేంద్రాల్లో జరిగే ఒలింపిక్ రన్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ క్లబ్, క్రీడాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమలాపురంలో స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వద్ద నుంచి ఒలింపిక్ డే రన్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, దున్నాల దుర్గ, గొలకోటి నారాయణరావు, సంఘ సభ్యులు కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, నల్లా స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల వసూళ్లకు సహకరించండి: కలెక్టర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ శాఖలు వాణిజ్య పన్నులు వసూళ్లకు సహకరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వాణిజ్య పన్నులు, జీఎస్టీ వసూళ్లపై బుధవారం వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు ట్రేడ్ లైసెన్సులు జారీచేసే సమయంలో, ఇంజనీరింగ్ విభాగాలు తమ కార్యకలాపాల నిర్వహణలో మెటీరియల్ కాంపోనెంట్‌పై పన్ను వసూళ్లకు తమ వద్దనున్న ఏజెన్సీల వివరాలను నిర్దేశిత ప్రోఫార్మాలో వాణిజ్య పన్నుల శాఖకు అందించాలని ఆదేశించారు. కొన్ని ఏజెన్సీలు పన్నుల చెల్లింపులో దీర్ఘకాలం జాప్యం చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో పన్నులు తీసుకున్నప్పటికీ ఆ సొమ్ములను వాణిజ్య పన్నుల శాఖకు జమ అవ్వడం లేదన్నారు. మున్సిపల్, ఇతర శాఖల అధికారులు తమ వద్దనున్న ఏజెన్సీల ట్రేడ్‌లైసెన్సుల వివరాలు తప్పనిసరిగా వాణిజ్య పన్నుల శాఖకు అందించాలన్నారు. కార్మికశాఖ రిజిస్ట్రేషన్ వివరాలు, నీటి వినియోగ సంఘాల రిజిస్ట్రేషన్ వివరాలు, నరేగా మెటీరియల్, సిమెంట్ జీఎస్టీ కోసం వివరాలు అందించాలన్నారు. జీఎస్టీ, వృత్తి పన్ను చట్టాల కింద నమోదు కాని వ్యాపార సంస్థలను గుర్తించాలన్నారు. రికవరీ కోసం ఆస్తులను గుర్తించడానికి రెవెన్యూశాఖ, బ్యాంకులు డిఫాల్టర్ల ఖాతాలను నిలుపుదల చేసేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖ నుంచి ట్రేడ్ లైసెన్సుల మద్దతు అవసరమన్నారు. గ్రానైట్, ఇసుక వంటి మైనింగ్ సుంకాలు, జీఎస్టీ ఎగవేత ఆదాయ నష్టాన్ని నివారించాలన్నారు. సమావేశంలో ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ జయనీరజ, డిప్యూటీ కమిషనర్ జి.నిర్మలజ్యోతి, అసిస్టెంట్ కమిషనర్లు ఎన్.సుబ్బారావు, టి.ధర్మారావు, మహేష్‌గిరి శాస్త్రి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి



జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యం

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 18 నెలలుగా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్‌కలెక్టర్ టి.నిషాంతిలకు వినతిపత్రాలు అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి. ట్యాక్సులు కట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ జాప్యం కావడంతో పడుతున్న ఇబ్బందులను వివరించారు. అడ్మిషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. వందశాతం సీట్లు కన్వీనర్ కోటా ద్వారానే పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల మాదిరిగా రెన్యువల్‌ను డిగ్రీ కళాశాలలకు కూడా ఐదేళ్లకోసారి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేవీఆర్‌విన్ నరసింహారావు, ఉపాధ్యక్షుడు అకుల బాపన్ననాయుడు, మద్దింశెట్టి రాంబాబు, కరాటం ప్రవీణ్, నల్లా తమ్మేశ్వరరావు, జి.బ్రహ్మానందం, వి.సాయిప్రసాద్, సత్యప్రసాద్, కె.సత్తిబాబు, నళినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలన వైఫల్యాలపై పుస్తకావిష్కరణ

అమలాపురం రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనా వైఫల్యాలను వివరిస్తూ జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం.. అంటూ ముద్రించిన పుస్తకాన్ని బుధవారం భట్నవిల్లిలోని మాజీమంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, బద్రి బాబ్జీ, పందిరి శ్రీహరి, మట్టపర్తి నాగేంద్ర, కొల్లాటి దుర్గాబాయి, కట్టోజు సన్నాయిదాసు, చిత్రపు రామకృష్ణ, గుత్తుల చిరంజీవి, వంటెద్దు వెంకన్నాయుడు, సూదా గణపతి, షేక్ అబ్దుల్ ఖాదర్, కేతా భానుతేజ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీపీ భూలక్ష్మి



పి.గన్నవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బుధవారం అమరావతి సీఎం కార్యాలయంలో మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీకి వారు చేసిన సేవలను సీఎంకు వివరించారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరినట్టు భూలక్ష్మి తెలిపారు. పార్టీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం సూచించారని ఆమె చెప్పారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు అంబటి కోటేశ్వరరావు ఉన్నారు.

కొనసాగుతోన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



సమ్మె శిబిరంలో ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన వైసీపీ కౌన్సిలర్లు

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 42వ రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరంలో చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైసీపీ కౌన్సిలర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని, వయోపరిమితి 60ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని, సిబ్బంది నినాదాలతో హోరెత్తించారు. సంఘీభావం తెలిపిన వారిలో కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, కొల్లాటి దుర్గాబాయి, దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వరరావు, బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్నాయిదాసు తదితరులు పాల్గొన్నారు. సమ్మె శిబిరానికి యూనియన్ నాయకులు నాగారపు శ్రీనివాస్, చిక్కాల తిరుమలవెంకటకుమార్, ఎం.మధు, బోనం రమేష్ నాయకత్వం వహించారు.

ఇరిగేషన్ అధికారులకు సన్మానం

పి.గన్నవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం నుంచి డీఈ నాగేంద్రకుమార్, పలువురు అధికారులు, సిబ్బంది బదిలీఅయ్యారు. బదిలీ అయిన డీఈ నాగేంద్రకుమార్, తాటిపాక సెక్షన్ ఇరిగేష్ అసిస్టెంట్ ఇంజనీర్ సుందర్‌సింగ్, సెక్షన్ హెడ్ గుమస్తా బాబ్జిలను బుధవారం గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, నీటిసంఘాల ప్రతినిధులు సన్మానించారు. రాజోలు సబ్‌డివిజన్ డ్రెయిన్స్ డీఈ నాగార్జున ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ కరుటూరి నర్సింహరావు, రాజోలు నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, పి.గన్నవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తి, కె.సత్యనారా యణరాజు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా ఫణి





సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, చిత్రంలో మాజీ మంత్రి చిక్కాల, నామన రాంబాబు, పక్క చిత్రంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఫణి

అంబాజీపేట, జూన్18(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీ ఎంపిక అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి ప్రకటిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావులు తెలిపారు. బుధవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో బుధవారం రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చిక్కాల, నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, నియోజకవర్గ కోకన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మండల ఎన్నికల పరిశీలకుడు టేకుమూడి లక్ష్మణరావు పర్యవేక్షణలో మండల కమిటీ ఎన్నిక చేపట్టారు. టీడీపీ మండల అధ్యక్ష పదవిని శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించడంతో గుడాల ఫణి, చంద్రశేఖర్ పోటీలో నిలిచారు. ఏకగ్రీవం చేసేందుకు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో టీడీపీ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులతో రహస్య ఓటింగ్ నిర్వహించారు. ఫణికి 27 ఓట్లు, చంద్రశేఖర్‌కు 5ఓట్లు వచ్చినట్లు నాయకులు తెలిపారు. దీంతో మండల అధ్యక్షుడిగా ఫణి ఎన్నికైనప్పటికీ అధిష్ఠానం నిర్ణయం మేరకు మండల కమిటీని ప్రకటిస్తామని రెడ్డి సుబ్రహ్మణ్యం, చిక్కాల తెలిపారు. మండల కార్యదర్శిగా రవణం రాము పేరును ప్రతిపాదించారు. అలాగే ఉపాధ్యక్ష, ఎస్సీ సెల్ పదవికి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో త్వరలో నూతన కమిటీని ప్రకటిస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, దంతులూరి శ్రీనురాజు, అరిగెల బలరామమూర్తి, చిన్నం బాలవిజయరావు, నాగాబత్తుల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి పంచాయతీ శివారు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సాదు శేషవేణికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. శేషవేణి ఇంటికి తాళం వేసి కుమార్తె ఇంటికి వెళ్లింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగివుండవచ్చని భావిస్తున్నారు. ఇంట్లో ఉన్న రూ.లక్ష కాలిపోయినట్టు అధికారులు గుర్తించారు. వీఆర్వో కోటిపల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పీఎస్ దివాకర్ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఆస్తి నష్టం రూ.రెండు లక్షలు ఉంటుందని అంచనా. ఎంపీటీసీ సలాది సురేఖావాణి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సత్తిబాబు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు అత్తిలి రాము బాధితులను పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

ఉప్పలగుప్తం, జూన్18(ఆంధ్రజ్యోతి):భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెం నెం.122 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం వేడుకగా నిర్వహించారు. తల్లిదండ్రుల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, పాఠశాల హెచ్‌ఎం జీవీ కృష్ణారావు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు కానుకలు పంపిణీ చేశారు.టీడీపీ బీసీ సెల్ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు, సీఎంసీ చైర్మన్ దొమ్మేటి ప్రసాద్, వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శీలం కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.సుశీల, డి.నాగకుమారి, ఎ.లక్ష్మీదుర్గ, ఎమ్మే విజయలక్ష్మి, రోటరీక్లబ్ మాజీ చైర్మన్ జంపన సుమన్‌వర్మ, శీలం భాస్కరరావు, బి.శ్రీను పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌తో వీఆర్వోలను తగ్గించడం అన్యాయం



కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అర్జీ అందజేస్తున్న జిల్లా వీఆర్వోల సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులు తగ్గించడం అన్యాయమని, వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు, తహశీల్దార్ల సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్, వీఆర్వోల రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 7500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపడం సరికాదన్నారు. రేషనలైజేషన్‌తో నిమిత్తం లేకుండా ప్రతీ గ్రామానికి ఒక వీఆర్వో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోలను పునః పరిశీలన చేయాలని కోరారు. అర్హులైన వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్, సంయుక్త కార్యదర్శి పి.శివరామకృష్ణ, డివిజన్ సంఘాల అధ్యక్షుడు కొమ్ముల స్వామినాయుడు, కోరుకొండ శ్రీను, ఏవీఎస్ రాజేష్, నవుండ్రు జయరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

తాగునీరు కలుషితమైతే సమాచారం ఇవ్వండి

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా తాగునీరు కలుషితమై సరఫరా అవుతుంటే వెంటనే ఫొటోలు తీసి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయం సెల్: 6301581364కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమస్యను నమోదు చేసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని క్యాంపు కార్యాలయం తెలిపింది.

ఉత్తమ సేవా పురస్కారానికి నాగాదిత్యన్ ఎంపిక



అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన లలితకళా సమాఖ్య ఏటా అందించే ఉత్తమ సేవా పురస్కారానికి అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్ట నాగాదిత్యన్‌ను ఎంపిక చేసినట్టు సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డుల సంబరం నిర్వహించనున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖులతో పాటు నాగాదిత్యన్‌కు సువర్ణ ఘంటా కంకణం, స్వర్ణ పతకం అందజేసి సేవా పురస్కారంతో సత్కరించనున్నారు. జోతిష్య, వాస్తు సిద్ధాంతిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాగాదిత్యన్‌కు మంచి పేరు ఉంది. నాగాదిత్యన్‌ను సహచర పంచాంగకర్తలు, సిద్ధాంతులు అభినందనలతో ముంచెత్తారు.

పవర్‌లిఫ్టింగ్‌లో కిరణ్‌కుమార్‌కు స్వర్ణ పతకం

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం జీకే ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన పవర్‌లిఫ్టర్ చీకురుమెల్లి కిరణ్‌కుమార్ 74 కిలోల మాస్టర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం దక్కించుకున్నారు. ఈసందర్భంగా బి.గోపీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌కు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, చీకట్ల కిశోర్, మణి, ప్రసాద్, కల్వకొలను ప్రవీణ్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

పి.గన్నవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా ముంగండ, నరేంద్రపురం వయా అవిడి మీదుగా రావులపాలెం, రాజమహేంద్రవరం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అమలాపురం డిపో మేనేజర్‌కు వారు వినతిపత్రం అందించారు. ఇటీవల అమలాపురం-గన్నవరం రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో బస్సు సర్వీ సులు నిలుపుదల చేశారన్నారు. రోడ్డు పులు పూర్తయినప్పటికి సర్వీసులను మాత్రం పునఃప్రారంభించలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, బి.రామరాజు, మట్టపర్తి శ్రీనివా సరావు, గుత్తుల శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా వైసీపీ అధిష్ఠానంతో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు అండంగా ఉంటారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పి.గన్నవరంలో నియోజకవర్గస్థాయి వైసీపీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈకార్యక్రమానికి నియోజక వర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రా యిల్, పిల్లి సూర్యప్రకాష్, పినిపే శ్రీకాంత్, జక్కంపూడి విజయలక్ష్మి, పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్, అంజిబాబు, వరలక్ష్మి, అడ్డగళ్ల సాయిరాం, నక్కా వెంకటేశ్వరరావు, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి శివరామ్, తోరం భాస్కరరావు, జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, మట్టపర్తి పండు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు,జూన్18(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన పసుపులేటి వెంకటశశిధర్-వెంకటసత్యలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందించారు. వెంకటశశిధర్ పుట్టినరోజు మే 1న ప్రతీ ఏడాది భక్తులకు అన్నప్రసాదం చేయాలని కోరారు.. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించి అభినందించారు. సహాయ కమిషనర్ సత్యనారాయణ, మొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యలో రాణించాలి

మామిడికుదురు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను వినియోగించుకుని విద్యలో రాణించాలని పెదపట్నంలంక సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య సూచించారు. పెదపట్నంలంక హైస్కూలులో 232మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను బుధవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ముత్యాల బాబీ, ప్రధానోపాధ్యాయుడు పి.చక్రవర్తి, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, పినిశెట్టి బాబ్జి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 8నుంచి 2గంటల వరకు కాట్రేనికోన, జీకే పోర, చిర్రయానాం, బలుసుతిప్ప, కొప్పిగుంట, పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు, బంటుమిల్లి, ఉప్పూడి, లక్ష్మీవాడ, పెనుమెల్ల, చెయ్యేరు, చెయ్యేరుఅగ్రహారం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి



తాగునీటి ట్యాంకరు కోసం నిరీక్షిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణం సూర్యనారాయణపేటలో 25రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి కోసం అప్పుడప్పుడూ వచ్చే ట్యాంకరు కోసం మహిళలు రాత్రివేళల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమీపంలోని అన్నివార్డులకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారని సూర్యనారాయణపేట ప్రాంతానికి మాత్రం తాగునీటి సరఫరా నిలిపివేయడం దారుణమన్నారు. తాగునీరు అందించాలని కోరుతూ ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ అందించామని కాలనీవాసులు ఎం.సత్యనారాయణ, కె.విష్ణు, సీహెచ్ దుర్గాప్రసాద్, సీహెచ్ శాంతకుమారి తదితరులు తెలిపారు. బోర్లు ద్వారా నీటిని తోడుకుందామంటే రొయ్యల కంపెనీల వ్యర్థాలతో పూర్తిగా గ్రౌండ్ వాటర్ కలుషితమైందని వినతిపత్రంలో వివరించారు. వస్తుందో రాదో తెలియని ట్యాంకరు కోసం బుధవారం రాత్రి ఆ ప్రాంత మహిళలు బిందెలతో ఎదురు చూడడం విశేషం.

బస్సు, ట్రాక్టర్ ఢీ

కాట్రేనికోన, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పల్లంకుర్రు వెళ్తున్న హైటెక్ బస్సు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించబోయే సమయంలో ఈప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఆవులను రోడ్లపై వదిలేయడం వల్ల అనేకసార్లు ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గూడపల్లి ఇన్‌చార్జి సర్పంచ్‌గా పెదపాటి

మలికిపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గూడపల్లి ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉపసర్పంచ్ పెదపాటి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సర్పంచ్ సుందర తాతాజీ మృతిచెందడంతో సర్పంచ్ పదవి ఖాళీ అయింది. ఉపసర్పంచ్ పెదపాటి సత్యనారాయణను ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ

అంబాజీపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి మేజర్ పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలనతో పాటు సర్పంచ్‌ల కాలంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన నేదునూరి ప్రసాద్ ఇటీవల ప్రజాపరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు. బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు ఆధ్వర్యంలో పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందిస్తామన్నారు.

ఆక్వా చెరువుల వద్ద మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

కాట్రేనికోన, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పెనుమల్లె పంచాయతీ శివారు గొరగనమూడి ప్రాంతంలో చేపల చెరువుల పేరుతో అనుమతులు పొంది, రొయ్యల సాగు చేస్తూ గ్రామాన్ని కలుషితం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానికులు చెరువుల వద్ద ఆందోళన చేపట్టారు. నివాస గృహాలకు ఆనుకుని చెరువుల తవ్వడంతో కలుషిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు, గర్భిణులు కలుషిత వాతావరణంతో అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం గ్రామంలో ఆక్వా సాగును నిలుపుదల చెయ్యాలని డిమాండ్ చేశారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



ర్యాలి వద్ద దేవరబంద డ్రెయిన్ పనులు చేపడుతున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ళుగా పట్టిపీడిస్తున్న ముంపు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ప్రతి ఏటా పంట పొలాలు ముంపు బారినపడి రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో అనేక సార్లు కథనాలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు ముంపు సమస్యకు పరిష్కారం ఏర్పరిచారు. ఆత్రేయపురం మండలం ర్యాలి దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న సైఫాన్‌కు మరమ్మతులు నిర్వహించి పంట పొలాల్లో ముంపునకు గురైన వర్షం నీటిని దేవరబంద మేజర్ డ్రెయిన్‌లోకి మళ్లించేందుకు మరమ్మతులు చేపడుతున్నారు. దుర్గమ్మ గుడి వద్ద ఉన్న సైఫాన్ మూసుకుపోవడంతో కొద్దిపాటి వర్షానికే ముంపు నీరు ముందుకు వెళ్లక పంట పొలాలు మునిగి పోతున్నాయి. ఇటీవల డ్రైనేజీశాఖ అధికారులు మరమ్మతులు చేపట్టడంతో ముంపునీరు ఎప్పటికప్పుడు దేవరబంద మేజర్ డ్రైనేజీలోకి వెళు తుంది. సైఫాన్‌కు మరమ్మతులు చేపట్టడం ద్వారా ముంపు సమస్యకు పరిష్కారం లభించినట్టు అయ్యింది. డ్రైనేజీశాఖ ఏఈ జయలక్ష్మి ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు.

టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు అధ్వర్యంలో యోగాంధ్ర

ఆలమూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించేలా ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాససాహిత్య ప్రాజెక్టు అధ్వర్యంలో జొన్నాడలో బుధవారం యోగా నిర్వహించారు. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అధ్వర్యంలో జొన్నాడలో పురందరదాసు భక్త మండలి సభ్యులతో యోగాసనాలు చేయించారు. యోగా వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తాయని వివరిస్తూ యోగాశానలపై శిక్షణ ఇచ్చి వారితో యోగా చేయించారు. కార్యక్రమంలో దాససాహిత్య భక్త మండలి ఏర్పాటు ప్రతినిధి పి.ముకుందేశ్వరస్వామి, జొన్నాడ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతినిధులు పాల్గొన్నారు.



జొన్నాడలో జరిగిన కార్యక్రమంలో యోగాసనాలు వేస్తున్న భక్త మండలి సభ్యులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందచ్చునని యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం భాస్కర మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి ఆవరణ లో పలువురు వైద్యులు గర్భిణిలతో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణిలు యోగా చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చునని తెలిపారు. అనంతరం యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.శ్రీధర్ నాయుడు, డాక్టర్ ప్రదీప్తి కరుణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో యోగా వేస్తున్న దృశ్యం

రోడ్డు పనులకు ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన

మండపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం అర్తమూరు-అనపర్తి మధ్య నిర్మించే రోడ్డు పనులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అర్తమూరు ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, చిర్ల ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నీటి పొదుపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ పద్మ

రావులపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నీటిపొదుపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆలమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ కె.పద్మ అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా సేవ్ వాటర్, సేవ్ ఎర్త్ అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పద్మ మాట్లాడుతూ భూగర్భ జలవనరులు నశించిపోతున్నందున చెట్లను పెంచడంతో పాటు నీటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో టింబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.కనికిరెడ్డి, అధ్యాపకులు బీపీఎన్ రెడ్డి, కె.రజని, సుభాషిణి, రమేష్‌బాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.97 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కళ్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,97,777 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బీజేపీ సంకల్ప సభ

ఆత్రేయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వెలిచేరులో బుధవారం వికసిత భారత్ అమృతకాల సంకల్పసభ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వెలిచేరులోని దూళిపాళ కామేశ్వరశాస్త్రి స్వగృహంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వికసిత భారత్ కన్వీనర్ మోకా వెంకటసుబ్బారావు పర్యవేక్షణలో సభ నిర్వహించారు. పదకొండేళ్ల మోదీ ప్రభుత్వంలో సామాన్య ప్రజల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు తమలంపూడి రామకృష్ణరెడ్డి, పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, కాలాబత్తుల చిన్నారి, జి.రాంబాబు, తడాల సుబ్రహ్మణ్యం, ఈశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వెలిచేరు సంకల్పసభలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

పసలపూడిలో గోవ గంగమ్మ గ్రామోత్సవం

రాయవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామ దేవత గోవ గంగమ్మ జాతరను బుధవారం నిర్వహించారు. స్థానిక గొల్లల తూము వద్ద ఉన్న ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఘటాన్ని గ్రామంలో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, పానకం, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



గంగమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వెలిచేరుకు చెందిన పరగన సురేష్ వద్ద రెండు లీటర్ల సారాతో అరెస్టు చేసి కొత్తపేట కోర్టులో హాజరుపర్చారు. దీంతో రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ కాత్యాయని తెలిపారు.



నర్సీపట్నంలో జరిగిన యోగాంధ్ర సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

యోగాంధ్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు కోరారు. బుధవారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో యోగాంధ్ర సమీక్షకు స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడారు.



రాయవరంలో షాపును తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

రాయవరంలో దుకాణాల తనిఖీ

రాయవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో పలు దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను బుధవారం జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల విక్రయాలు జరిపే దుకాణాల్లో బరువులు తూచే యంత్రాలను పరిశీలించడంతో పాటు పెట్రోల్ బంక్‌లో కొలతలు, నాణ్యతను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీటిని చేపట్టినట్టు లీగల్ మెట్రాలజీ అధికారి ఎస్.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ తనిఖీల్లో సీనియర్ టెక్నికల్ లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ సిబ్బంది

మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేత

మండపేట, జూన్, 18(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకుడు పాలపర్తి సుబ్బరాజు సారధ్యంలో ఉద్యోగుల సమస్యలు వివరించగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి చెప్పినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాజకీయ నాయకులతో సమీక్ష జరుపుతున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

ప్రజా ప్రతినిధులతో తహసీల్దార్ సమీక్ష

మండపేట, జూన్, 18(ఆంధ్రజ్యోతి) ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెయ్యి కంటే తక్కువ ఓట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నాయకులు కోరారు. మండల తహసీల్దార్ పి.తేజేశ్వరరావు బుధవారం నియోజకవర్గానికి సంబంధించి ప్రధాన పార్టీల నాయకులతో ఆయన తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఆయా అంశాలపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు ఎం.రవీంద్రరెడ్డి, యారమాటి వెంకన్నబాబు, ఎ.సత్యనారాయణతోపాటు డిప్యూటీ తహసీల్దార్ పి.మెహర్‌బాబా, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు సత్యం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కె.గంగవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల గ్రామానికి చెందిన చిట్టూరి రామ్మోహన్‌రావు కిడ్నీ వ్యాధికి చికిత్స చేయించుకున్నారు. కూటమి నాయకుల ద్వారా మంత్రి సుభాష్‌కు ఈ విషయం తెలిసింది. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, రూ.75,700 మంజూరైంది. బుధవారం మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, రామ్మోహన్‌రావుకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో నేడు ఉచితనేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, జైభీమ్ సైనిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగరాజు తెలిపారు. నేటి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సేవలందిస్తారన్నారు.

పాత జూనియర్ కళాశాల స్థలంలో..

మట్టి అక్రమ తవ్వకాలు

• ఇటుకబట్టి యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు • చోద్యం చూస్తున్న అధికారులు

రాయవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరడంతో జూనియర్ కళాశాలను రెండేళ్ల క్రితం రాయవరం హైస్కూల్ ప్రాంగణంలో మార్పు చేశారు. అప్పటి నుంచి శిథిలావస్థలో ఉన్న పాత జూనియర్ కళాశాల భవనం నిరుపయోగంగా మారడంతో పాటు మందుబాబులకు , అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో పాటు అక్రమార్కులు ఇష్టానుసారంగా కళాశాల స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. పాత జూనియర్ కళాశాల భవనం వెనుక ఉన్న కొంత ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంలో ఇటుకబట్టీ యజమాని ఒకరు గడ్డి పెంపకం చేసినట్టు సమాచారం. ఖాళీ స్థలంలో ఉన్న మట్టిపై కన్నేసిన ఇటుకబట్టి యజమాని అనుమతులు లేకుండా అక్కడున్న చెట్టును నరికివేయడంతో పాటు అక్రమంగా మట్టిని తరలించుకుపోయాడని స్థానికులు రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వానికి చెందిన పాత జూనియర్ కళాశాల స్థలాన్ని స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించిన రాంబాబు అక్రమంగా మట్టి తరలించుకుపోయిన ఘటనపై ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యా అధికారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని రాంబాబు, పలువురు కూటమి నేతలు కోరారు.



రాయవరం పాత ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక స్థలంలో మట్టి తవ్వేయడంతో ఏర్పడిన గొయ్యి

ఎట్టకేలకు.. డ్రెయిన్‌కు మోక్షం

ఆలమూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని మురుగునీటి డ్రైన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. దీర్ఘకాలంలో డ్రైన్ తవ్వకాలు చేయకపోవడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలువురు రైతులు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు తెలిపారు. దీంతో ఆయన ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డ్రైన్‌ను తక్షణం తవ్వకాలు చేపట్టాలని ఆయన ఆదేశించడంతో తవ్వకాలు ప్రారంభించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. డ్రైన్ ముసుకుపోవడం వల్ల జొన్నాడ, ఆలమూరులోని పంట భూములు ముంపునకు గురవుతున్నాయని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. పంట భూములకు సాగునీరు ఎంత అవసరమో, మురుగునీరు పోవడం అంతే అవసరమని గుర్తించి ఈ ఏడాది అనేక డ్రైన్లు శుభ్రం చేయించామన్నారు.



ఆలమూరు మురుగునీటి డ్రైన్‌ని శుభ్రం చేస్తున్న దృశ్యం

పురందరదాసు సంకీర్తనల శిక్షణ తరగతులు ప్రారంభం

ఆలమూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పురందరదాసు సంకీర్తనలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధ్వర్యంలో దాససాహిత్య హరే శ్రీనివాస భక్త మండలి సభ్యులకు మూడు రోజులపాటు అందించే శిక్షణ తరగతులు జొన్నాడలో బుధవారం ప్రారంభమయ్యాయి. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆనందతీర్థాచార్యులు అధ్వర్యంలో ఈనెల 18, 19, 20 తేదీల్లో భక్తమండలి సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న దాససాహిత్య ప్రాజెక్టు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తమండలి సభ్యులంతా ఈ శిక్షణలో పాల్గొంటారని దాససాహిత్య భక్త మండలి ఏర్పాటు ప్రతినిధి పి.ముకుందేశ్వర స్వామి తెలిపారు. శిక్షణ తరగతులు ప్రారంభానికి ముందుగా గ్రామంలో పురందరదాసుల సంకీర్తనలతో భక్తమండలి సభ్యులు భారీ ఊరేగింపు నిర్వహించారు. జొన్నాడ శ్రీజనార్దన భజన మండలి, శ్రీబాలగోపాల భజన మండలి అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడలో పురందరదాసు సంకీర్తనల శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లాకు 1.83 లక్షల పుస్తకాల రాక



రావులపాలెం జడ్పీ పాఠశాలలో పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ మమ్మి

రావులపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాల లైబ్రరీలకు 1.83 లక్షల పుస్తకాలు వచ్చాయి. రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో ఉంచిన లైబ్రరీ పుస్తకాల గొడౌన్‌ను డిప్యూటీ కలెక్టర్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 1263 ప్రాథమిక పాఠశాలలకు, 66 ప్రాథమికోన్నత పాఠశాలలు, 193 సెకండరీ, 50 సీనియర్ సెకండరీ పాఠశాలలకు 1,83,647 లైబ్రరీ పుస్తకాలు గొడౌన్‌లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వీటిని మండల కేంద్రాలకు తరలిస్తామన్నారు. సమగ్రశిక్ష ఏఎంవో పి.రాబాబు మాట్లాడుతూ ముందుగా మండలాల వారీగా విభజన చేసి తరలిస్తామన్నారు. అనంతరం విద్యాశాఖాధికారులు వారికి కేటాయించిన సంఖ్యల ఆధారంగా పాఠశాలలకు తరలించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, నాగరాజు, రాజేంద్రప్రసాద్, రాజబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లీలాకృష్ణకు విశ్వ బ్రాహ్మణ సంఘం సన్మానం



వల్లూరులో లీలాకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణకు మండపేట మండలం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. నీటి పారుదలశాఖ రాష్ట్ర చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, నాదెండ్ల మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తణుకు జేసీ ప్రసాద్, రాష్ట్ర నాయకులు వి.శ్రీనివాస్, కామాక్షి ఆలయ చైర్మన్ టి.మాణిక్యాలరావు, పట్నాల శ్రీనివాస్, మండపేట అధ్యక్షులు వి.రాధాకృష్ణప్రసాద్, టి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కపిలేశ్వరపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కోటిపల్లి ఇరిగేషన్ ఏఈగా సుందర్ సింగ్



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఈ సుందర్‌సింగ్

కె.గంగవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఇరిగేషన్ ఏఈగా దుర్గం సుందర్ సింగ్ నియమితులయ్యారు. ఈయన తాటిపాక సెక్షన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బుధవారం కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. ఇక్కడ పనిచేసిన బి.సుబ్రహ్మణ్యం ద్రాక్షారామ బదిలీ అయ్యారు.



ఆసుపత్రి భవనం పనులను పరిశీలిస్తున్న ఎంపీ బోస్, ఎమ్మెల్యే వేగుళ్ల

ఆస్పత్రి పనులు పరిశీలన

మండపేట, జూన్, 18(ఆంధ్రజ్యోతి) మండపేటలో నిర్మాణంలో వున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం పనులను బుధవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఆసుపత్రి భవనం పనులపై ఏపీఐడీసీ అధికారులతో వారు చర్చించారు. వీటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, ఎం.సూర్యప్రకాష్, పాలచర్ల శిరీష్, వాదా ప్రసాదరావు, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలంటూ రిలే నిరాహారదీక్ష చేస్తున్న శ్రీవాణి

హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించే వరకు దీక్ష విరమించేదిలేదు

మండపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన వల్లూరి శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 62వ రోజుకు చేరింది. ఆమె చేస్తున్న దీక్షకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ ప్రహరీ నిర్మించే వరకు దీక్ష విరమించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు భాస్కర్, జోసెఫ్, కనక, సౌమ్య, లహరీ, చైతన్యమౌళి తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యశర్మకు సువర్ణ కంకణం బహూకరిస్తున్న దృశ్యం

సుబ్రహ్మణ్య శర్మకు సువర్ణ కంకణం బహూకరణ

ఆత్రేయపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంకంపాలెంలోని విశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకుడు కొత్తలంక వియస్ సుబ్రహ్మణ్యశర్మకు జ్యోతిష్య వాస్తు చక్రవర్తి బిరుదుతో పాటు సువర్ణ కంకణం బహూకరించారు. హైదరాబాదులో విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ అధ్వర్యంలో జ్యోతిష్య సమ్మేళనం నిర్వహించారు. ఈ వేడుకల్లో సుబ్రహ్మణ్యశర్మ జ్యోతిష్య వాస్తు శాస్త్రంలో కృషి ప్రతిభకు గాను సువర్ణ కంకణం, వాస్తు కళానిధి బిరుదును అందించారు. జ్యోతిష్య పండితులు పి.శ్రీనివాసరావు, గోపాలకృష్ణశర్మ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీకాంత్‌శర్మ చేతులు మీదుగా అవార్డు, బిరుదుతో సత్కరించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కె.నరసింహారావు, ఉప సర్పంచ్ విశ్వేశ్వరి దంపతులు అభినందించారు.